క్లుప్తంగా

16న సీఎం జగన్‌కు కృతజ్ఞతాభినందన



ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

అమరాపురం: పెనుకొండలో ఈనెల 16న సీఎం జగన్‌కు కృతజ్ఞతాభినందన సభ నిర్వహిస్తున్నట్లు పెనుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామిని వారు మర్యాదపూర్వకంగా కలిశారు. సభకు రావాలంటూ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, శివశర్మ మాట్లాడారు. ప్రభుత్వం లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి నెలకు రూ.5 వేల చొప్పున అందజేయడం అభినందనీయమన్నారు. సీఎం జగన్ గత నాలుగేళ్లలో 5,781 మందికి రూ.41.52 కోట్లు ఆర్థికసాయం అందించారన్నారు. న్యాయవాదుల అభ్యున్నతికి రూ.100 కోట్లు కేటాయించి వెలుగులు నింపారని కొనియాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు శివశర్మ, విక్రాంత్ నాయక్, బాలాజీ, చంద్రశేఖర్, మడకశిర ఏపీపీ గోపాల్‌రావు, అడ్వకేట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



బాధితుడితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి

హిందూపురం టౌన్: ప్రమాదంలో గాయపడి వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న ఓ వ్యక్తికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకుడు వేణురెడ్డి అండగా నిలిచారు. వివరాలు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మహమ్మద్ ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఇటీవల లేపాక్షిలో జరిగిన ప్రమాదంలో అతడి కాలు విరిగిపోయింది. మంచానికే పరిమితం అయ్యాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో సమస్యను వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, నాయకుడు వేణురెడ్డికి వివరించాడు. స్పందించిన వారు వెంటనే వైద్యులతో మాట్లాడారు. చికిత్సకు ఏర్పాట్లు చేయించారు. మహమ్మద్ వైద్యానికి అయ్యే ఖర్చు తామే భరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

లేపాక్షి: మండలంలోని మల్లిరెడ్డిపల్లి, కొండూరు–2 పాఠశాలల్లో పని చేస్తూ పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు శశిధర్, మణిమాలను గురువారం స్థానిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు, ఎంఈఓ–2 కుళ్లాయప్ప పాల్గొన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



గ్రామస్తులతో చర్చిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి

రొళ్ల: మండల పరిధిలోని బాజయ్యపాళ్యం నుంచి కురుబరహట్టి గ్రామానికి వెళ్లే రోడ్డు సమస్య పరిష్కారమైంది. గురువారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, సర్పంచ్ చిన్నరంగప్ప, ఎంపీటీసీ సభ్యుడు జగదీష్‌బాబు తదితరులు బాజయ్యపాళ్యం గ్రామానికి వెళ్లారు. రోడ్డు సమస్యపై గ్రామస్తులను ఆరా తీశారు. నాలుగు అడుగుల కాలినడకన దారి పక్కన ప్రభుత్వ వంక బొరంబోకు స్థలం గుండా 12 అడుగుల రోడ్డు వేసుకునేందుకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం తొలగిస్తే రోడ్డు వేయడానికి ఇబ్బంది లేకుండా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. సర్పంచ్ చిన్నరంగప్ప, ఎంపీటీసీ సభ్యుడు జగదీష్‌బాబు స్పందించి విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి కరెంట్ స్తంభాన్ని మార్చేందుకు కృషి చేస్తామన్నారు. వీఆర్వో ప్రకాష్, సర్వేయర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో ఉత్తీర్ణత

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులు ఎన్‌సీసీ విభాగంలో ప్రతిభ కనబరిచారు. 2021–23 సంవత్సరానికి గానూ పాఠశాల తరఫున మొత్తం 46 మంది విద్యార్థులు ఎన్‌సీసీ ఏ–గ్రేడ్ విభాగంలో పాల్గొన్నారు. ఏ గ్రేడ్‌లో 37 మంది, మరో తొమ్మిది మంది విద్యార్థులు బీ గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్ బాబు తెలిపారు. విద్యార్థులతో పాటూ శిక్షణ ఇచ్చిన ఆర్మీ అధికారి అరుణ్‌కుమార్‌ను అభినందించారు.

వలంటీర్లకు వందనం

శిర వెళ్లి.. పింఛన్ అందజేసి

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు రాజేష్‌కుమార్. మడకశిర మండలం కల్లుమర్రి గ్రామంలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. కరోనా సమయంలో తన ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలకు సేవలందించాడు. తన సచివాలయ పరిధిలో భర్తను కోల్పోయి దిక్కు లేక అనాథగా మారిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలు రెండు నెలల క్రితం కర్ణాటక రాష్ట్రం శిర పట్టణంలోని ఆశ్రమానికి చేరుకుంది. పింఛన్ వస్తున్నా తీసుకోలేని పరిస్థితి. విషయం తెలుసుకున్న వలంటీర్ రాజేష్ కుమార్.. శిర పట్టణానికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. అలాగే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరిస్తున్నాడు. అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులను తీసుకుని సంక్షేమ పథకాలను మంజూరు చేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

– మడకశిరరూరల్:



కర్ణాటక రాష్ట్రంలోని శిర పట్టణంలో లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజేష్ కుమార్ (ఫైల్)

కన్నబిడ్డలా చూసుకున్నాడు..



నా భర్త చనిపోవడంతో అనాథగా మారాను. బంధువులు లేకపోవడంతో కర్ణాటక రాష్ట్రం శిరా పట్టణంలోని ఆశ్రమానికి చేరుకున్నాను. అయితే వలంటీర్ రాజేష్‌కుమార్.. ఆశ్రమానికి వచ్చి బాగోగులు తెలుసుకున్నాడు. కన్నబిడ్డలా చూసుకున్నాడు. వేలిముద్రలు వేయించుకుని రెండు నెలల పాటు పింఛన్ డబ్బులు అందజేశాడు. ఆశ్రమంలో ఉన్న వారు సైతం వలంటీర్ సేవలను కొనియాడారు. గత ప్రభుత్వంలో ఇలా సమయానికి పింఛన్ సొమ్ము అందలేదు. వలంటీర్ల పనితీరు బాగుంది. పథకాలన్నీ అందిస్తున్నారు.

– లక్ష్మమ్మ, కల్లుమర్రి, మడకశిర మండలం

వలంటీర్లకు వందనం

ప్రాణాలొడ్డి.. సేవలందించి

ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు శోభ. ఒంటరి మహిళ. హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురంలో నివాసముంటోంది. కోవిడ్ సమయంలో హిందూపురమంతా లాక్‌డౌన్ ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. 60 ఏళ్ల పైబడిన వారు అసలే ఇంటి నుంచి బయటకు రాకూడదని చెప్పారు. ఇంట్లో సరుకులు లేక బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడింది. శ్రీకంఠపురం 8వ వార్డు వలంటీర్ సుధ.. వృద్ధురాలి పరిస్థితిని తెలుసుకుంది. వెంటనే ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుంది. నిత్యావసర సరుకులు, మందులను ఇంటి వద్దకే వెళ్లి అందజేసింది.

– హిందూపురం టౌన్:



కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో సరుకులు అందజేస్తున్న వలంటీర్ సుధ (ఫైల్)

వలంటీర్ సేవలు మరువలేం..



కరోనా సమయంలో ప్రజలంతా ఇబ్బందులు పడ్డారు. కోవిడ్ కేసులు పెరగడంతో లాక్‌డౌన్ విధించారు. ఆ సమయంలో ఎవరూ ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. ప్రాణభయంతోనే ఇంటి పక్కన ఉన్న వారితో కూడా మాట్లాడే పరిస్థితి లేదు. అలాంటి సమయంలో కూడా మా వార్డు వలంటీర్ సుధ మా ఇంటికి వచ్చింది. నా ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంది. నా కోసం మందులు, నిత్యావసరాలు తీసుకువచ్చింది. వలంటీర్ సేవలకు రుణపడి ఉండాల్సిందే.

– శోభ, శ్రీకంఠపురం 8వ వార్డు, హిందూపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి

- సీఎం జగన్‌ను ప్రజలు ఆశీర్వదించాలి
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ



అమరాపురం: పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

అమరాపురం: ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం అమరాపురం సచివాలయ పరిధిలోని వైఎస్సార్ సర్కిల్, పాత ఎస్సీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. మళ్లీ సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు ఎంతగానో భరోసా ఇచ్చాయని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. చెరువు వద్ద గత ఏడాది వర్షాలకు తమ ఇళ్లు ముంపునకు గురి అయ్యాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. త్వరలోనే అందరికీ ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు గగన, వీరక్యాతరాయ, లక్ష్మీదేవి, క్రిస్టియన్ ఫైనాన్స్ డైరెక్టర్ సుందర్‌రాజు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు త్రిలోక్‌నాథ్, నారాయణ, సిద్దప్ప, జేకే మూర్తి, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

ప్రజారంజక పాలనే ప్రభుత్వ ధ్యేయం

పెనుకొండ రూరల్: ప్రజారంజక పాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాంపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తొలుత కార్యకర్తలు అభిమానులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా సచివాలయంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేయడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా పంచాయతీ వ్యాప్తంగా 1,217 సర్టిఫికెట్లను అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. పథకాలన్నీ అందుతున్నాయా అంటూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లను పనితీరును అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్ల నిర్మాణాలు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, నూతన గృహాల మంజూరు తదితర సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. వెంటనే అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే శంకరనారాయణ.. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకరప్ప, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, ఎంపీపీ గీత, జెడ్పీటీసీ శ్రీరాములు, సచివాలయాల కన్వీనర్ శ్యాము నాయక్, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, నారాయణ యాదవ్, వెంకటేష్, పెద్ద ఆంజనేయులు, బైపురెడ్డి, మల్లయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.12.5 లక్షలతో డ్రైనేజీ పనులు

హిందూపురం టౌన్: సీఎం వైఎస్ జగన్ సహకారంతో హిందూపురాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక అన్నారు. గురువారం రహమత్‌పురంలోని అబ్రహాం మసీదు వెనుక రూ.12.5 లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. వార్డులోని సమస్యలను కౌన్సిలర్ షాజియాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా హిందూపురంలో టీడీపీ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కనీసం వార్డుల్లో కాలువలు, రోడ్డులు వేయలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధే పరమావధిగా కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు ఆసీఫ్, రామచంద్ర, మల్లికార్జున, మల్లికార్జున గౌడ్, గిరీష్, కోఆప్షన్ మెంబర్ సువర్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ బాషా, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

డీఎల్ రోడ్డులో..

పట్టణంలోని డీఎల్ రోడ్డులో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండు రోజుల క్రితం డీఎల్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక వార్డులో అధికారులతో పర్యటించిన విషయం తెలిసిందే. సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పనులు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వెంకట నాగేంద్రబాబు, నవీన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు

మడకశిర: జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచడమే ధ్యేయమని డ్వామా పీడీ రామాంజనేయులు తెలిపారు. గురువారం పట్టణంలోని సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో ఉపాధి పనులపై నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా ఉపాధి పనులపై సమీక్షించారు. మండలాల్లో ఎంత మంది కూలీలు పని వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. హార్టికల్చర్ పనులపై ఆరా తీశారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడుతూ.. లక్ష్యం మేరకు ప్రతి మండలంలో పనులు చేపట్టి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కూలీలు అడిగిన వెంటనే పనులు కల్పించాలని ఆదేశించారు. లక్ష్య సాధనలో ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హార్టికల్చర్‌కు సంబంధించి గుంతలు తీసే పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వెంటనే మొక్కలు నాటేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీడీ జయసింహ, కోర్స్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఏపీఓలు, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: పండ్ల మొక్కల పెంపకాన్ని మరింతగా ప్రోత్సహించాలని డ్వామా పీడీ రామాంజినేయులు తెలిపారు. గురువారం ఆమిదాలగొంది పంచాయతీలో పర్యటించారు. రైతుల పొలాల్లో మొక్కల పెంపకానికి తీస్తున్న గుంతలను పరిశీలించారు. మామిడి, జామ, అల్ల నేరేడు, సీతాఫలం, చింత, డ్రాగన్‌ఫ్రూట్ తదితర మొక్కల పెంపకానికి ఇప్పటి 186 ఎకరాల్లో 90 మంది రైతుల పొలాల్లో గుంతలు తీయిస్తున్నామని వివరించారు. మొక్కల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. అనంతరం పండ్ల మొక్కల పెంపకం, ఉపాధి పనులపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో ఏపీడీ జయసింహ, ఏపీఓ శ్రీకాంత్‌గౌడు, సీడీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మొక్కల పెంపకానికి తీస్తున్న గుంతలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామాంజనేయులు

జోరుగా జగనన్న సురక్ష



గోరంట్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ



అమరాపురం: సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొన్నారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అమరాపురం సచివాలయం–2 పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరయ్యారు. 11 రకాల ధ్రువపత్రాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను గురించి వాటిని పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు హిందూపురం, లేపాక్షి మండలం కల్లూరులో జరిగిన కార్యక్రమాల్లో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గోరంట్ల, పరిగి, రొళ్ల, గుడిబండ, చిలమత్తూరు, అగళి, రొద్దంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సర్టిఫికెట్లు అందజేశారు.

– సాక్షినెట్‌వర్క్:



లేపాక్షి: లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న పార్టీ సమన్వయకర్త దీపిక



హిందూపురంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆధ్వర్యంలో..

బీమా చెల్లింపునకు గడువు పొడిగించాలి

పావగడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన బీమా చెల్లింపునకు గడువు తేదీని పొడిగించాలని వైఎస్ హొసకోట రైతులు గురువారం అధికారులను కోరారు. ఈ సందర్భంగా రైతు చేతన్ మాట్లాడుతూ.. వాణిజ్య పంటల బీమా సొమ్మును చెల్లించడానికి ఈనెల 15 తేదీతో గడువు ముగుస్తుందన్నారు. సీఎస్‌సీ కేంద్రాల్లో ఫసల్ బీమా యోజన వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాలతో బీమా సొమ్ము చెల్లించలేక పోతున్నామన్నారు. గడువు తేదీని పొడిగించాలని విన్నవించారు. కార్యక్రమంలో రైతులు జయప్రకాశ్, రాకేశ్, నాగరాజు పాల్గొన్నారు.

రక్తదాతలకు గుర్తింపు ఇవ్వాలి

హిందూపురం అర్బన్: ఆపదలో రక్తదానం చేసి, ప్రాణాలను కాపాడుతున్న రక్తదాతలకు తగిన గుర్తింపు ఇవ్వాలని జాతీయ రక్తదాతల జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రక్తదాతల జేఏసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రక్తదాతల జేఏసీ ప్రతినిధి, టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూక్ ఖాన్, డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ మాట్లాడారు. అత్యవసర సమయంలో ప్రాణం పోసే రక్తదాతలను గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రూ.10 లక్షల ఉచిత బీమా అందించాలన్నారు. సేవా పతకాలతో సత్కరించాలని సూచించారు. నెలసరి గౌరవ వేతనం ఇవ్వాలని తీర్మానించి నివేదికను ప్రభుత్వానికి పంపారు. కార్యక్రమంలో హాజీనాసీర్, షబ్బీర్ పాల్గొన్నారు.

పీఈటీలకు శిక్షణ

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవన నైపుణ్యాలపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఎస్‌సీఈఆర్‌టీ, మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ భాగస్వామ్యంతో గుర్తింపు పొందిన పాఠశాలల్లోని పీఈటీలకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌మెన్‌పై దాడి



గాయపడిన గుడిబండప్ప

చిలమత్తూరు: మండలంలోని వడ్డిచెన్నంపల్లిలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్న గుడిబండప్పపై అదే గ్రామానికి చెందిన కిష్టప్ప దాడి చేశాడు. నీరు వదిలే విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహానికి గురైన కిష్టప్ప.. గుడిబండప్పను కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

పరిగి: మహిళలు స్వశక్తితో ఎదగాలని అనంతశక్తి మహిళా సొసైటీ సభ్యులు తెలిపారు. గురువారం మండలంలోని గణపతిపల్లిలో టింబక్టు కలెక్టివ్ ఆధ్వర్యంలో మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహాశక్తి సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ రామాంజనమ్మ మాట్లాడారు. మహిళల కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు ప్రవేశపెట్టాయన్నారు. మహిళలు చైతన్యవంతులై సమాజంలో అన్ని విధాలా రాణించాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య సభ్యులు రమీజ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోండి

హిందూపురం అర్బన్: మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులతో దురుసుగా ప్రవర్తిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పారిశుధ్య కార్మికులు కోరారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రక్షణ పరికరాలు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరసింహప్ప, కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

చిలమత్తూరు: మండలంలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ 12 ద్విచక్ర వాహనాలకు ఈనెల 15న స్థానిక పీఎస్‌లో వేలం పాట నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు రూ.5,000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

చికిత్స పొందుతూ ముతవల్లీ మృతి



భక్తర్ (ఫైల్)

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఫాజియా మసీదు ముతవల్లీ భక్తర్ (48) నాలుగు రోజుల క్రితం హిందూపురం సమీపంలో ఓ కర్ణాటక బస్సు ఢీ కొనడంతో గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స అనంతరం ఇంట్లో కోలుకుంటున్నాడు. అయితే గురువారం హఠాత్తుగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, దూదేకుల సంఘం నాయకులు యూడి కుల్లాయప్ప, సోడా బాబు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహానికి నివాళులర్పించారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

పరిగి: మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన నందకిషోర్, హేమంత్‌కుమార్, పరిగి అమర్ విద్యామందిరం విద్యార్థిని షేక్ రజియా సుల్తానా ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరి ఎంపికపై తల్లిదండ్రులతో పాటూ ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

రొళ్ల: కల్లురొప్పం గొల్లహట్టి గ్రామంలో రైతు ఈరన్నకు చెందిన ఆవు గురువారం మధ్యాహ్నం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. వివరాలు.. ఆవును మేత కోసం గ్రామ సమీపంలోని బోరు బావి వద్ద కట్టేశారు. విద్యుత్ మోటార్ వద్ద అమర్చిన స్టార్టర్ సర్వీస్ వైర్ ఆవుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.60 వేల వరకూ నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న పశువైద్యశాఖ సహాయకుడు అణ్ణప్ప స్వామి ఆవుకు పోస్టుమార్టం నిర్వహించారు. బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

లేపాక్షి: కోడిపల్లి పంచాయతీ పరిధిలోని నాగేపల్లి నుంచి పొలాలకు వెళ్లేందుకు రోడ్డు ఏర్పాటు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు కంప చెట్లను తొలగించి, మట్టి వేయించారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ వెంకటరత్నమ్మ నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణానికి సహకరించిన ఎంపీపీ, కన్వీనర్ నారాయణస్వామి, సర్పంచ్ మంజునాథ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.